క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులకు స్థల పరిశీలన



పెనుగంచిప్రోలు(వత్సవాయి): శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయాన్ని గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ చీఫ్ ఇంజినీర్ డీవీఆర్ శేఖర్‌బాబు, ఈఈ గంగయ్య, డీఈ భవిరి రవి పరిశీలించారు. అమ్మవారి ఆలయంలో అన్నదానం, ప్రసాదం తయారీ కోసం నూతన భవనాల నిర్మాణం, బంగారు కాలనీవైపు గోడ నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం స్థల పరిశీలన చేశారు. ఆలయ ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

వీరులపాడు తహసీల్దార్‌గా రవికుమార్



వీరులపాడు: మండల తహసీల్దార్‌గా పాలపర్తి రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వెలగపూడి సచివాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై మండల తహసీల్దార్‌గా వచ్చి డీటీ నాగరాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్‌కు డీటీ, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ఘనసత్కారం



వీరులపాడు:విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గ్రామ నాయకుడు పచ్చాల కోటేశ్వరరావు కొనియాడారు. నరసింహారావు పాలెం అంగనవాడీ కేంద్రం వద్ద గురుపౌర్ణమి సందర్భంగా అంగనవాడీ కార్యకర్తలను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నందిగామరూరల్: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ హెచ్చరించారు. పట్టణంలోని అంబారుపేట గ్రామ సమీపంలోని ఫ్లై ఓవర్ అండర్‌పాస్ వద్ద గురువారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలువురు వాహనచోదకులకు జరిమానా విధించారు.

కౌలువేలం నిర్వహణ

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారికి భూముల కౌలు వేలం ద్వారా రూ.1.56 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సాంబశివరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం గ్రామంలోని 22 ఎకరాల భూములకు బహిరంగ వేలం నిర్వహించగా, వత్సవాయి మండలం సింగవరం గ్రామానికి చెందిన రామకృష్ణ హెచ్చుపాటదారునిగా నిలిచినట్లు ఈవో వివరించారు . ఆలయ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



నందిగామ రూరల్: నందిగామ ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షిత తాగునీటిని సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలిపారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనాసాగరం వద్ద నిర్మించనున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ స్థలాన్ని, పట్టణంలో నూతనంగా నాలుగు జోన్‌లలో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌ల స్థలాలను ఆయన పరిశీలించారు. ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏ దారైనా.. దారుణమే!

- అధ్వానంగా గండేపల్లి-నందలూరు రోడ్డు
- మోగులూరు రోడ్డు పరిస్థితి అంతే
- అడుగడుగునా గోతులు
- ప్రజలకు తప్పని అవస్థలు



గండేపల్లి- నందలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై లేచిపోయిన కంకర



అధ్వానంగా ఉన్న కంచికచర్ల-మోగులూరు రోడ్డు

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో పలు రోడ్లు ఛిద్రమైపోయాయి. ఆర్‌అండ్‌బీ, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్‌శాఖ రోడ్లన్నీ అధ్వానంగా ఉండటంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అధికారంలోకి రాగానే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామన్న కూటమి ప్రభుత్వం, ఆ హామీని గాలికొదిలేసింది.

గోతులమయమైన రోడ్లు..

కంచికచర్ల మండలం గండేపల్లి నుంచి వీరులపాడు మండలం నందలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయమైంది. రోడ్డుపై కంకర పూర్తిగా లేచిపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై నియోజకవర్గ కేంద్రమైన నందిగామ నుంచి వీరులపాడు మండలం నందలూరు, తాటిగుమ్మి, గోకరాజుపల్లి మీదుగా వెల్లంకి, కొణతానపల్లి, పల్లంపల్లి మీదుగా తెలంగాణ రాష్ట్రం చిలుకూరు, మధిర వరకు నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. ఈరోడ్డులోని పంటపొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకే చేర్చే క్రమంలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు పల్టీలు కొట్టిన ఘటనలు ఉన్నాయి.

ప్రమాదభరితంగా ప్రయాణం..

కంచికచర్ల నుంచి బత్తినపాడు మీదుగా మోగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడా రాళ్లలేచి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో వర్షపునీరు రోడ్లపై నిలబడి ఉంటుంది. ఎక్కడ ఏ గోయి ఉంటుందో వాహనదారులకు అర్థంకాని పరిస్థితి నెలకొంటుంది. ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి నియోజకవర్గంలోని ఆయా రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం ఇబ్బందిగా ఉంది..



గండేపల్లి నుంచి నందలూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నాం. రోడ్డును అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– గడుపూడి సత్యనారాయణ, గండేపల్లి

రోడ్ల అభివృద్ధికి చర్యలేవి...



మున్నలూరు–మోగులూరు రోడ్డంతా గోతులమయం కావడంతో నిత్యం కంచికచర్ల, నందిగామకు వెళ్లే విద్యార్థులు, ప్రజల అవస్థలు అన్నీఇన్నీకావు. రోడ్ల మరమ్మతులకు నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా ఈ రోడ్డును అభివృద్ధి చేయాలి.

– రాయల నరసింహారావు, మున్నలూరు

నిధులు రాగానే రోడ్లు అభివృద్ధి చేస్తాం..

గండేపల్లి-నందలూరు, మున్నలూరు-మోగులూరు వెళ్లే రోడ్ల అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరుకాగానే ఆయా రోడ్ల అభివృద్ధి పనులు చేపడతాం.

– శోభూషణ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, నందిగామ

మృతుని కుటుంబానికి పరామర్శ



రామారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): ఈనెల ఏడో తేదీన బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై, ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందిన గుడిమెట్లకు చెందిన దర్శి రామారావు మృతదేహాన్ని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ మోహన్‌రెడ్డికి పరామర్శ...

చందర్లపాడు(నందిగామటౌన్): ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన బబ్బెళ్లపాడు గ్రామ సర్పంచ్ గుదిబండ మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గురువారం పరామర్శించారు. మోహన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో పరామర్శించి ప్రమాద వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెడికల్ రిపోర్టులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మోహన్‌రెడ్డిని పరామర్శించినవారిలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పేట ఆనందసాయి ఆలయంలో బారులు తీరిన భక్తులు



నందిగామ రామిలింగేశ్వరనగర్‌లో సాయినాథుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

నందిగామటౌన్: పట్టణంలోని షిరిడీ సాయి మందిరాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చెరువుబజారులో వేంచేసియున్న సాయిబాబా మందిరంలో ధర్మకర్త తమ్మవరపు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రామలింగేశ్వర నగర్‌లోని సాయిబాబా, పాత బస్టాండ్‌లోని మహిమసాయి ఆలయంలో అర్చకులు స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా నందిగామ మండలంలోని రామిరెడ్డిపల్లి, తొర్రగుడిపాడుతో పాటు ఆయా గ్రామాల్లోని సాయిమందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కంచికచర్ల : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకులు మూర్తి ఆధ్వర్యంలోన అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పెద్దబజార్‌లోని రామాలయం, మహాలక్ష్మి ఆలయం, శివాలయం, శివసాయి క్షేత్రంలో సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

బలుసుపాడు(జగ్గయ్యపేట):గ్రామంలోని గురుధాంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాత్వికుడు గెంటేల వెంకట రమణ ఆధ్వర్యంలో శివానంద కృప విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలగిరిలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించి గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు.ఆలయ ఈవో సాంబశివరావు, అర్చకులు పాల్గొన్నారు.


పెనుగంచిప్రోలు(వత్సవాయి): పెనుగంచిప్రోలు చెరువుకట్ట వద్ద ఉన్న సాయిబాబు ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. చెరువుకట్ట సాయిబాబా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక ఆనంద సాయి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గురుదేవులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి బ్రాహ్మణబజారులోని తన నివాసంలో భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. విశ్వకర్మ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించగా నాగార్జున హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ చావా కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

శాకంబరీగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



శాకంబరీదేవిగా అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



పల్లగిరి త్రిశక్తి పీఠంలోని కనకదుర్గమ్మ అమ్మవారు



పేటలో శాకాంబరీ అలంకరణలో ఈశ్వరీమాత



కంచికచర్ల కన్యకా పరమేశ్వరి ఆలయంలో

నందిగామరూరల్: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు గురువారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నందిగం సుబ్బారావుశర్మ, కోటేశ్వరరావు శర్మ, టీటీడీ వేదపండితుడు దుర్భాకుల రఘునాథశర్మలు కలిసి సత్యమ్మ అమ్మవారిని గురువారం క్వింటాన్నర కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జ్ ఈవో పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ఆలయంలో మూడు జుల పాటు శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆషాడం సారె సమర్పణ..

అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారికి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను నియోజకవర్గ ఇన్‌చార్జ్ తంబళ్లపల్లి రమాదేవితో కలిసి ఆషాడం సారెను సమర్పించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి తంబళ్లపల్లి రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లగిరి త్రిశక్తి పీఠంలో..

పల్లగిరి గట్టుపైన త్రిశక్తిపీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లకు పంచామృతాలు, పలురకాల పండ్ల రసాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రాజేష్‌శర్మ కనకదుర్గమ్మ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాడం సారె, పొంగళ్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, అనుమోలు జనార్దన్, కొప్పు హనుమంతరావు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నందిగామటౌన్: పట్టణంలోని శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని ఆరు క్వింటాళ్ల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరీవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు మణికంఠ పాండే ఆధ్వర్యంలో వాసవీమాతకు కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శాకాంబరీగా ఈశ్వరీమాత..

జగ్గయ్యపేట: పట్టణంలోని వేంచేసియున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలోని ఈశ్వరీదేవి అమ్మవారు గురువారం శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సాయిచార్యులు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వర్ణకార సంఘ నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జడ్జి హిమబిందుకు ఘనసత్కారం



జగ్గయ్యపేట అర్బన్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి గురుపూజోత్సవం సందర్భంగా గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో న్యాయమూర్తి ఎ.హిమబిందు, సీనియర్ న్యాయవాదులు సామినేని వెంకటేశ్వరరావు, బద్దుల వెంకట్రామయ్య, ఈవీ.జగన్నాథరావులను ఘనంగా సన్మానించారు.

నరసింహునికి పవిత్రారోహణ



వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి పవిత్రారోహణ, అష్టకలశారాధన, అభిషేకాలు నిర్వహించారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి విశ్వవిద్యాలయం ఆగమ పండితుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు, అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం గరుడవాహనంపై ఊరేగించారు.ఈవో సురేష్‌బాబు, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు పేట స్విమ్మర్లు ఎంపిక

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 19వతేదీ నుంచి విశాఖపట్నంలో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించనున్న పదోవ జూనియర్, సబ్‌జూనియర్, ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లాజట్టుకు జగ్గయ్యపేటకు చెందిన స్విమ్మర్లు టీఎం.చరణ్, సామినేని కీర్తిక ఎంపికయ్యారు. జిల్లాజట్టులో స్థానం సంపాదించిన వీరిని పేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ కోచ్ పొట్టాబత్తిన సందీప్, టీం మేనేజర్ అన్నంనేడి కల్యాణ్, స్థానికులు అభినందించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఎస్‌ఐ రాజు, విద్యార్థులు

కంచికచర్ల: విద్యార్థులు గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బోనగిరి రాజు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్‌కు నో అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ యువత ఒకసారి డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మీడియేషన్ సెంటర్ ఏర్పాటు



మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యలక్ష్మీప్రసన్న, పక్కన న్యాయవాదులు

నందిగామరూరల్: భార్యభర్తల కేసులు, కుటుంబసభ్యుల మధ్య వచ్చే భూ వివాదాలు తదితర సమస్యలు ఏర్పడిన సమయంలో మీడియేషన్ సెంటర్ ద్వారా ఇరువురికి సత్వర న్యాయం అందించే వీలుంటుందని సీనియర్ సివిల్ జడ్జి సత్యలక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. 16వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్థానిక కోర్టు ప్రాంగణంలో గురువారం మీడియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి సత్యలక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఈ సెంటర్ ఏర్పాటుతో కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు, కుటుంబ సభ్యుల మధ్య స్నేహభావం పెంపొందించవచ్చన్నారు. ఈనెల ఒకటి నుంచి 90 రోజులపాటు ఈ మీడియేషన్ సెంటర్ ప్రోగ్రాంను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, బండి మల్లికార్జునరావు, కన్నెకంటి జీవరత్నం, మన్నెం నారాయణరావు, కొమ్మినేని మాలేశ్వరరావు, యరగొర్ల రామారావు, వేల్పుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

నందిగామరూరల్:మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనంగా రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గురువారం కూడా నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఐదు రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, దాసు, బ్రహ్మం, కార్మికులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు, ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న షేక్ ఇస్మాయిల్, ఎక్సైజ్ సీఐ, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేటఅర్బన్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, తరగని ఆస్తి అయిన చదువులో విద్యార్థులంతా రాణించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సూచించారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా రూ 46.5లక్షలతో అభివృద్ధి చేసిన క్రీడామైదానం, లైబ్రరీ, కంప్యూటర్లను ఆయన ప్రారంభించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ నీలిశెట్టి సత్యనారాయణ, హెచ్‌ఎం కె.హేమమాధవి, విద్యాకమిటీ చైర్మన్ చింతల శ్రీలక్ష్మి, వార్డు కౌన్సిలర్ గొట్టె నాగరాజుపాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యాసంస్థల్లో ..

పట్టణంలోని విజ్ఞాన్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వత్సవాయి/పెనుగంచిప్రోలు: వత్సవాయిలోని మహాత్మా జ్యోతీభాయి పూలే బీసీ గురుకుల పాఠశాల, పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పెనుగంచిప్రోలు తహశీల్దార్ ఏ శాంతిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ జెడ్పీటీసీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, హెచ్‌ఎంలు నక్కా బాబురావు, కే జలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశానికి ఆయన హాజరైన ప్రసంగించారు.హెచ్‌ఎం రమణ, గ్రామపెద్దలు తాళ్లూరి వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు పాల్గొన్నారు. అదేవిధంగా వేదాద్రి పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే దారిలో కుక్కల బెడద అధికంగా ఉండటంతో చిన్నారులు భయపడుతున్నారంటూ సమస్యను ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. సర్పంచ్ పేరయ్య, ఉప సర్పంచ్ జగ్జీవన్ రామ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడురాలు చల్లా దుర్గా వైకుంఠరావు పాల్గొన్నారు. తిరుమలగిరి, ధర్మవరప్పాడుతండ, తక్కెళ్లపాడు గ్రామాల్లో కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.

కంచికచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం మాట్లాడుతూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నందికట్ల కుందన వెంకటనాగశ్రీ సాయి, నందికట్ల కుందన వెంకటనాగశ్రీ, మహ్మద్ ముషీరలకు ఎక్సైజ్ సీఐ, తెలుగు ఉపాధ్యాయుడు ఇస్మాయిల్ కలిపి రూ.6వేలను నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్‌దేవ్ చేతుల మీదుగా అందజేసి సత్కరించారు.

నందిగామరూరల్: జొన్నలగడ్డ, అడవిరావులపాడు, చందాపురం, లింగాలపాడు, మాగల్లుతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, మన్నే కళావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నందిగామ టౌన్: స్థానిక మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా కెవీఆర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ రాయప్ప, కళాశాల అధ్యక్షుడు ఎర్రంరెడ్డి బాబురావు, ఉపాధ్యక్షుడు వెచ్చా ఉమామహేశ్వరగుప్తా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆషాఢం సారె సమర్పణ



వత్సవాయి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహామేరు శ్రీచక్ర వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారికి గురువారం సారె సమర్పించారు. మహిళలంతా ఊరేగింపుగా సారెను తీసుకుని వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు తదితరులు పాల్గొన్నారు.